ప్రజాశక్తి
సోమవారం 3 జులై 2023
5
పార్వతీపురం మన్యం



## పార్కులో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్కులో పర్యాటకులు సందడి చేశారు. ఆది వారం సెలవు కావడం, ఎండలు ఎక్కువగా ఉండడంతో కాస్త ఉపశమనం పొందేందుకు పర్యాటకులు పార్కునకు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. పార్కులో ఉన్న అందాలను ఆశ్వాదించారు. హ్యాంగ్ బ్రిడ్జిపై నడిచి వెళ్లారు. జలవిహార్ వద్ద బోటు షికారు చేశారు. చిన్నారులు మినీ ట్రైన్ ఎక్కి ఆడుకున్నారు. స్కై సైకిల్ ఎక్కి ఆకాశంలో చక్కెర్లు కొట్టారు. అనంతరం మెట్టుగూడ జలపాతాన్ని సందర్శించారు.



పార్కులో సందడి చేస్తున్న చిన్నారులు

# సండే పార్వతీపురంలో మండే

- నిర్మానుష్యమైన రోడ్లు
- ఎండిపోతున్న నారుమడులు
- అన్నదాత ఆందోళన

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

మృగశిర కార్తి ముగిసిపోయి వానల కోసం ఎదురుచూస్తున్న సమయంలో, వర్షాల సంగతి ఏమోగానీ భానుడు తన ప్రతాపాన్ని తీవ్రంగా చూపిస్తున్నాడు. ఆదివారం పార్వతీపురం పట్టణంతో పాటు మండల ప్రజలు తీవ్రంగా భానుడి కోపానికి గురయ్యారు. ఉదయం 6 గంటల నుంచే సూర్యుడు తన ప్రతాపం మొదలెట్టుగా 10గంటలయ్యేసరికి వడగాడ్పులు తోడయ్యాయి. వేడి గాలులకు జనం తాళలేక మధ్యాహ్నం 12 గంటలు అయ్యేసరికి వీధులన్నీ నిర్మానుష్యంగా మారాయి. జులై నెలలో ఎప్పుడూ ఇంతటి ఉష్ణోగ్రతలు ఎరుగని ప్రజలు ఎండ వేడిమికి ఉక్కిరిబిక్కిరయ్యారు. ఎప్పుడూ రద్దీగా ఉండే పార్వతీపురం- విశాఖపట్నం ప్రధాన రహదారి వాహనదారులు కరువై నిర్మానుష్యంగా మారింది. ఎల్‌నినో ప్రభావంతో మరికొద్ది రోజులు వాతావరణం ఇలాగే ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఆరుద్ర కార్తీ సెంటిమెంటుతో విత్తనాలు చల్లుకున్న రైతులు ఘొల్లుమంటున్నారు. నారుమళ్లను సమీపంలోని చెరువుల ద్వారా నీటిని తరలించి తడుపుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. గత కొద్ది రోజుల క్రితం కురిసిన వర్షానికి విత్తనాలు చల్లుకోవడంతోపాటు, వెదజల్లే పద్ధతిలో వ్యవసాయాన్ని ప్రారంభించారు. సకాలంలో వర్షాలు కురవకపోవడంతో విత్తనాలు జల్లి వారం, పది రోజులు కావస్తున్నా మొలకలు రాకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే కరువు ఏర్పడే స్థితిని ఊహించుకొన్న అన్నదాతల గుండెలు బరువెక్కుతున్నాయి. కొన్ని పరిస్థితుల్లో జులై నెల రెండు, మూడు వారాల్లో వర్షాలు పడిన సంఘటనలు ఉన్నందున, గత అనుభవాన్ని దృష్టిలో ఉంచుకొని రైతులు ఏ విధమైన ఆందోళన చెందొద్దని వ్యవసాయ అధికారులు తెలియచేస్తున్నారు.




నిర్మానుష్యమైన పార్వతీపురం- విశాఖ రహదారి

**గుమ్మలక్ష్మీపురం :** ఈ ఏడాది ఖరీఫ్‌కు సకాలంలో వర్షాలు కురుస్తాయని ఆశించిన రైతన్న వరి దుక్కులు ప్రారంభించి 20 రోజుల క్రిందట విత్తనాలు కూడా చల్లారు. జూలై నెల వచ్చినా నేటికీ సరైన వర్షాలు కురవని పరిస్థితి. మరోవైపు ఎండల తీవ్రత నమోదు అవుతూనే ఉంది. రోజువారి ఉష్ణోగ్రతలు 36 డిగ్రీలు పైబడి నమోదు అవుతున్నాయి. దీంతో నారుమడి ఎండిపోతుంది. ఈ నేపథ్యంలో పలుచోట్ల గిరిజన రైతులు సమీపంలో ఉన్న గుంటల వద్ద నిల్వ ఉన్న నీరు మోసుకొస్తూ నారుమడికి పోసి సంరక్షిస్తున్నారు.



ఎండిపోతున్న నారుకు నీరుపోసి తడుపుతున్న రైతు

# ఏం కో/తి నాలో...



- మండుతున్న కూర'గాయాలు'
- ఏది కొన్నా రూ.70 పైనే
- సెంచరీ దాటేసిన టమోటా
- బెంబేలెత్తుతున్న ప్రజలు

**''ఏం కొనేటట్టు లేదు.. ఏం తినేటట్టు లేదు' అప్పటికీ ఎప్పటికీ సామాన్యుడంమర్చిపోని పాట.. మార్కెట్లో ధరలు పెరిగినప్పు డల్లా సామాన్యుని ఈ పాట గుర్తుకొస్తుంది. ప్రస్తుతం మార్కెట్లో ఏ కూరగాయ ముట్టుకున్నా పేలిపోతున్నాయి. కిలో రూ.70 నుండి 100 ధర పలుకుతున్నాయి. ఇక టమాటా విషయానికొస్తే సెంచరీ దాటేసిన పరిస్థితి నెలకొంది. ఈ పరిస్థితిల్లో సామాన్యులు అంత ధర పెట్టి కూరగాయలు కొనుగోలు చేయలేక పావు, అరకిలోలతో సరిపెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.**

ప్రజాశక్తి - కురుపాం

వర్షాల్లేకపోవడంతో కూరగాయల ధరలు ఆకాశాన్నంటాయని, వర్షాలు పడి నెలరోజులు గడిచే వరకూ ఈ ధరలు ఇలాగే ఉంటాయని వ్యాపారవర్గాలు చెబుతున్నాయి. దీంతో చేసేదేమీ లేక మహిళలు కూరగాయలను బంగారంలా ఆచితూచి వాడుతున్నారు. కిలోలు వండే కుటుంబంలో పావు కిలోతో సరిపెట్టుకుంటున్నారు. కొద్ది రోజుల ముందు పతనమైన టమోటా నేడు మంచి రేటు వచ్చిందని సంతోషంతో రైతులు ఉన్నా పెరిగిన ధరలతో కోనుగోళ్లు తగ్గాయని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో కూరగాయల ధరలను అదుపు చేయకపోతే సామాన్యుడు ఇంకొన్నాళ్లు ధరల మంటలతో అల్లాడిపోయే పరిస్థితులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. స్థానికంగా పంట అందుబాటులో లేకపోవడం, కూరగాయలను దిగుమతి చేసుకోవడంతో రవాణా ఖర్చులు తడిచి మోపెడై ధరలు అమాంతం పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు.. ఆకాల వర్షాలతో కొన్నిచోట్ల పంటలు దెబ్బతినడంతో దిగుబడి తగ్గడంతో రేట్లు పెరిగాయని దళారులు చెబుతున్నారు. ఎండాకాలం అయిపోయిన తరువాత కూరగాయల ధరలు ఆకాశాన్నంట డంతో వినియోగదారులను వాధిస్తోంది. అయితే వర్షాలు సకాలంలో పడకపోవడం వల్లే పంట ఇంకా చేతికి రాలేదని రైతులు చెబుతున్నారు.

**పెరిగిన కూరగాయల ధరలు :**

టమాట రూ.80 నుంచి రూ.100పలుకుతుంది. పచ్చిమిర్చి రూ. 100 నుంచి రూ. 120వరకు, బెండకాయ రూ. 60 నుంచి రూ.80, కాకర రూ.60 నుంచి రూ.80, చిక్కుడు రూ.65 నుంచి రూ.80, కేరెట్ రూ.80 నుంచి రూ.100, క్యాప్సికమ్ రూ.80 నుంచి 90, బీరకాయ రూ. 60 నుంచి 80, దొండకాయ రూ.60 నుంచి 80 పలుకుతుంది. అల్లం కిల్లో రూ.250 పలుకుతుంది. ఆకు కూరలు దిగుబడి తగ్గడంతో కట్ట రూ 15 నుంచి 20పలుకుతుంది. అధిక ఉష్ణోగ్రతలు వల్ల ఆకుకూరలు కూడా మార్కెట్లో ఎక్కువగా కనబడటం లేదు.

**మాంసం ధరలూ పైపైకి :**

కూరగాయల ధరల కన్నా మాంసం ధరలు ముందే పెరిగాయి. కేజీ చికెన్ కిలో 280 నుంచి 300 పలుకుతుంది. చేపలు కిలో రూ. 80, మటన్ కిలో రూ.800 పలుకుతుంది. దీంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలకూ కంటకంగా మారుతుంది. ఇకరోజు రోజుకు పెరుగుతున్న ద్రవ్యోల్బణం కారణంగా పప్పుధాన్యాల ధరలు కూడా పెరిగాయి. కోడి గడ్లు ఒక డజన్ రూ. 80పలుకుతుంది. దీంతో మధ్యతరగతి ప్రజలు ఏమి కొనలేని పరిస్థితి ఏర్పడింది.

పక్కకు ఒరిగిపోయిన బస్సు



## అదుపుతప్పిన ఆర్‌టిసి బస్సు

- తప్పిన పెను ప్రమాదం
- 22 మంది ప్రయాణికులు సురక్షితం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని మారుమూల ప్రాంతమైన కేసరి, వంగర నుంచి గుమ్మలక్ష్మీపురం వైపు వస్తున్న పార్వతీపురం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు అదుపుతప్పింది. ఈ సంఘటన ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే పార్వతీపురం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు వంగర గ్రామం నుంచి తిరుగు ప్రయాణంలో ఘాటీ దిగుతుండగా మలుపు వద్ద అదుపు తప్పింది. అయితే డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి బ్రేక్ వేయడంతో పెను ప్రమాదం తప్పింది. ప్రమాద సమయంలో బస్సులో ఉన్న 22మంది ప్రయాణికులు ప్రాణాపాయంతో సురక్షితంగా బయటపడ్డారు. కేదారిపురం, గుమ్మలక్ష్మీపురం, పార్వతీపురం ప్రాంతాలకు వెళ్తున్న ప్రయాణికులు ఉన్నారు. ఆర్‌టిసి బస్సు అదుపుతప్పిన సమీపాన సుమారు ఇరవై అడుగుల వరకు లోయ ఉంది. ఘాట్ రోడ్డు సమీపాన నిర్మించిన రక్షణ గోడలు అక్కడ అక్కడ శిథిలమయ్యాయి. వర్షాకాలం వచ్చిందంటే చాలు ఈ రహదారిపై ప్రయాణం ప్రాణాపాయంగా మారుతుంది. గత ఏడాది కురిసిన భారీ వర్షాలకు ఘాట్ రోడ్డు సగభాగం కుంగిపోయింది. స్పందించిన అధికారులు మరమ్మతులు చేయించారు. అయితే పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టి వాహన రాకపోకలకు వీలు కల్పించాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

# సరసమైన ధరలకే నాణ్యమైన ఉత్పత్తులు

- అమ్మకాల లక్ష్యం రూ.1.45 కోట్లు
- 2450 క్వింటాళ్ల చింతపండు సేకరణ
- 'ప్రజాశక్తి'తో జిసిసి డివిజనల్ మేనేజర్ మహేంద్రకుమార్ ముఖాముఖి



**గిరిజన సహకార సంస్థ ( జిసిసి) ద్వారా సరసరమైన ధరలకు నాణ్యమైన ఉత్పత్తులను అమ్ముతున్నట్టు జిసిసి పార్వతీపురం డివిజనల్ మేనేజర్ వి.మహేంద్రకుమార్ తెలిపారు. ఈ ఏడాది జిసిసి ద్వారా రూ.1.45కోట్లు విలువైన సరులకు అమ్మకానికి లక్ష్యంగా తీసుకున్నామని, ఆ దిశగా పనులు చేస్తున్నట్టు తెలిపారు. అలాగే గతేడాది 2450 క్వింటాళ్ల చింతపండును సేకరించినట్టు చెప్పారు. వీటితో పాటు జిసిసి ద్వారా చేపడుతున్న మరిన్ని పనులను 'ప్రజాశక్తి' ముఖాముఖికి వివరించారు. వివరాలు ఆయన మాటల్లోనే...**

**-ప్రజాశక్తి, కలెక్టరేట్**

**మన్యం జిల్లాలో లభ్యమవుతున్న ప్రధాన అటవీ ఉత్పత్తులు ఏమిటి?**

జిల్లాలో ప్రధానంగా చింతపండు ఎక్కువ లభ్యమవుతుంది. అదేవిధంగా కరక్కాయలు, నల్లజీడి, ముసిడికి పిక్కలు, ఇండుగ పిక్కలు, కాగుపప్పు, నరమామిడి చెక్క, ఉసిరి, తానికాయలు వంటి ఆయుర్వేద సంబంధిత ఉత్పత్తులతో పాటుగా కొండ చీపుర్లు, కుంకుడు కాయలు ఎక్కువగా లభ్యమవుతున్నాయి.

**డిఆర్ డిపో ద్వారా ఏఏ పంటలను ఎంత మొత్తం కొనుగోలు చేస్తున్నారు?**

గత సంవత్సరం జిసిసి పరిధిలోని పది మండలాల్లోని డిఆర్ డిపోల ద్వారా 2450 క్వింటాళ్ల చింతపండును ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కిలో 32.40 రూపాయలు చొప్పున, అదేవిధంగా 8 ఆర్బికేల ద్వారా గత ఖరీఫ్‌లో 39,250 క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేశాం. ఆ ధాన్యానికి సంబంధించిన రూ.8కోట్లు నగదు చెల్లించాం. వీటితో పాటుగా రవాణా, హమాలీ ఖర్చులు కూడా ఆ రైతులకు జమ చేస్తున్నాం. గతేడాది అటవీ, వ్యవసాయ ఉత్పత్తులు కొనుగోలు కలిపి జిసిసి లక్ష్యం రూ.54 కోట్లుగా నిర్ణయించగా, రూ.53.33 కోట్లుకు కోరుకున్నాం.

**జిసిసి పరిధిలో ఎన్ని డిఆర్ డిపోలున్నాయి?**

పార్వతీపురం జిసిసి డివిజన్ కార్యాలయం పరిధిలో 101 డిఆర్ డిపోలున్నాయి. ఈ డిఆర్ డిపోల ద్వారా ప్రభుత్వ రాయితీల మేరకు బియ్యం, పంచదార, కందిపప్పు, గోధుమపిండి, తదితర రేషన్ సరుకులను ఇంటింటికి పంపిణీ చేస్తున్నాం. వీటితో పాటు జిసిసి సరఫరా చేస్తున్న సుమారు 30 రకాల నాణ్యమైన ఉత్పత్తులను సరసమైన ధరలకే విక్రయిస్తున్నాం. అలాగే అటవీ ఉత్పత్తులను గిరిజనుల నుంచి సేకరించాం.

**అటవీ ఉత్పత్తుల సేకరణపై గిరిజనులు అవగాహన పెంపొందించేందుకు ఏ విధమైన అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు?**

గిరిజనుల్లో అటవీ ఉత్పత్తుల సేకరణలో అవగాహన కోసం ఇది వరకే గిరిజన గ్రామాల్లోనూ, సంతలో జరిగే ప్రదేశాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టి నాణ్యమైన గిరిజన ఉత్పత్తులను సేకరించి డిఆర్ డిపోల ద్వారా విక్రయించడం ద్వారా ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర లభించింది. గిరిజనులకు గిట్టుబాటు ధర అందుతుందని, అదేవిధంగా ఎటువంటి దళారీల జోక్యం లేకుండా, మధ్యవర్తుల చేతిలో మోసపోకుండా విక్రయించుకోవచ్చని తెలిపారు.




**చింతపండు, జీడి సేకరణపై ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?**

జిల్లాలో జరిగే చింతపండుకు చాలా ప్రాముఖ్యత ఉంది. మన ప్రాంతంలో లభించే చింతపండు బయట మంచి గిరాకీ ఉంది. అందువల్ల గిరిజనులకు నాణ్యమైన చింతపండు సేకరించాలని ఆ విధంగా చేయడం వల్ల ఆ చింతపండుతో గుజ్జు, ఫ్లేవర్, రసం ఇలా రకరకాలుగా అదనపు ఉత్పత్తులను జోడించి మార్కెటింగ్ చేసుకొనే అవకాశం ఉంది. అదేవిధంగా మన ప్రాంతంలో ఎక్కువగా జీడి పంట ఉత్పత్తి ఉంది. చాలామంది గిరిజనులు జీడి పంటపై ఆధారపడి జీవిస్తున్నారు. ఇటీవల ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రకటించిన జీడిపప్పు ప్రాసెసింగ్ యూనిట్ వల్ల ఎంతోమంది గిరిజనులకు లబ్ధి చేకూరుతుంది.

**డిఆర్ డిపో, జిసిసి సూపర్ బజార్ ద్వారా అమ్మకాలు ఏ విధంగా జరుగుతున్నాయి?**

పార్వతీపురం డివిజన్ పరిధిలో గల 101 డిఆర్ డిపోలకు, 8 సూపర్ బజార్లకు గతేడాది లక్ష్యం రూ.2.25 కోట్లు కేటాయించగా, జిసిసి ద్వారా రూ.1.75 కోట్ల అమ్మకాలు నిర్వహించాం. ప్రస్తుత సంవత్సరానికి గానూ రూ.1.45 కోట్ల అమ్మకాలను లక్ష్యంగా కేటాయించడం జరిగింది.

### ప్రత్యామ్నాయం చూస్తారా

## మాదారి మేం చూసుకోవాలా?

- భంజ్ దేవ్‌పై అనుచరుల ఒత్తిడి
- రహస్య భేటీలో పాల్గొన్న తెలుగు తమ్ముళ్లు

ప్రజాశక్తి - సాలూరు

మాదారి మేం చూసుకోవాలా, ప్రత్యామ్నాయ అభ్యర్థిని సూచిస్తారా అని నియోజకవర్గంలోని టిడిపి అసమ్మతి నాయకులు, కార్యకర్తలు మాజీ ఎమ్మెల్యే ఆర్పీ భంజ్ దేవ్‌పై ఒత్తిడి పెంచుతున్నారు. కొద్దిరోజుల క్రితం విజయనగరం సమీపంలో ఉన్న ఓ రిసార్ట్‌లో భంజ్‌దేవ్‌తో కలిసి నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన ముఖ్య నాయకులు భేటీ అయినట్లు తెలుస్తోంది. నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుమ్మిడి సంధ్యారాణితో పొసగని కారణంగా ప్రత్యామ్నాయ అభ్యర్థిని తెరపైకి తేవాలని వారు భంజ్‌దేవ్‌ను గత కొంతకాలంగా డిమాండ్ చేస్తున్నారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి సంధ్యారాణి ఏకపక్ష నిర్ణయాలు, ఒంటెద్దు పోకడలకు తీవ్ర అసంతృప్తితో ఈ నాయకులు రగిలిపోతున్న పరిస్థితి కనిపిస్తోంది. తాను చేసిందే శాసనమని, చెప్పిందే వేదమన్న రీతిలో సంధ్యారాణి వ్యవహరిస్తున్న తీరుపై మాజీ ఎమ్మెల్యే కూడా అసంతృప్తితో వున్నారు. పాచిపెంట మండలానికి చెందిన జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ పిన్నింటి ఈశ్వరరావు, మక్కువ మండల పార్టీ సీనియర్ నాయకులు పెంట తిరుపతి రావు, మెంటాడ మండలం సీనియర్ నాయకులు గెద్ద అన్నవరం, సాలూరు మండల పార్టీ అధ్యక్షులు ఎ.పరమేష్, పట్టణ పార్టీ సీనియర్ నాయకులు గొర్లి మధుసూదనరావు రిసార్ట్ భేటీలో పాల్గొన్నట్లు తెలుస్తోంది. ఎన్నికల ముహూర్తం సమీపిస్తున్న తరుణంలో నియోజకవర్గంలో పార్టీ వాస్తవ పరిస్థితిని అధిష్టానం దృష్టికి తీసుకెళ్లాలని మండల పార్టీ నాయకులు పట్టుబడుతున్నారు. ఇప్పటికే పార్టీ టికెట్ రేసులో ఇద్దరు, ముగ్గురు గిరిజన ఉద్యోగులు వున్నారనే ప్రచారం జరుగుతోంది. వారిలో ఎవరు సమర్థులో నిర్ధారించి అధిస్థానం పెద్దలకు చెప్పి టికెట్ వచ్చేలా చూడాలని కోరినట్లు సమాచారం. లేదంటే రానున్న ఎన్నికల్లో పార్టీకి ఓటమి తప్పదనే సంకేతాలను పార్టీ నాయకత్వానికి స్పష్టం చేయాలని భంజ్‌దేవ్ అనుచరులు డిమాండ్ చేసినట్లు తెలుస్తోంది. నియోజకవర్గ పార్టీలో తెలుగు తమ్ముళ్ల అసమ్మతి స్వరం చాపకింద నీరులా విస్తరిస్తోంది.

# పనుల పేరిట రైతులను దగా చేస్తున్న ప్రభుత్వం

- నత్తనడకన పెదంకలాం కాలువ పనులు
- పరిశీలించిన రైతు సంఘాల ప్రతినిధులు

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని పెదంకలాం కాలువ పనుల పేరిట మూడేళ్ల నుంచి రైతులను వైసిపి ప్రభుత్వం దగా చేస్తుందని రైతుసంఘాల ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు ఆదివారం రైతు సంఘాల ప్రతినిధి బృందం పెదంకలాం కాలువ పనులను పరిశీలించింది. ఈ సందర్భంగా ప్రతినిధి బృందం మాట్లాడుతూ గత మూడేళ్ల క్రితం జెకె నిధులు రూ.18 కోట్లుతో కాలువ బాగు చేయడానికి కాలువ ఇరువైపులా సిమెంట్ ర్యాంపులు, కాలువ లోపల బేస్మెంటు సెట్టర్లు బాగు కోసం కోట్ల రూపాయలు కేటాయించిందన్నారు. కానీ గత మూడేళ్లుగా ఆనకట్టు హెడ్ దగ్గర ఎటువంటి పనులు చేయలేదని, పైగా అరసాడ వద్ద 600 మీటర్లు ఒక పక్క సిమెంట్ ర్యాంపు, మరికొంత దూరం కిలోమీటరు రెండు పక్కల సిమెంట్ ర్యాంపు వేశారు తప్ప ఇంకా ఎటువంటి పనులు చేయలేదు. పైగా ఇప్పుడు కాలువలో ఎటువంటి పనులు జరగడం లేదు. ఈ విధంగా పనులు చేస్తే మరొక ఐదు, పదేళ్లయినా పెదంకలాం కాలువ నుంచి సాగునీరు రైతులకు అందదనీ, గత మూడేళ్లుగా సాగునీరు రాక రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారని బృందం తెలిపింది. ఈ ఏడాది వర్షాలు పడక నారుమల్లు నీరులేక ఎండిపోతున్నాయి. ఈ ఏడాదైనా కాలువలో గండ్లు పూడ్చాలని, కాలువలో అడ్డుగా ఉన్న గట్లు తొలగించి తక్షణమే కాలువ ద్వారా నీరు విడిచి పెట్టాలని కోరింది. అలాగే షెట్టర్లు పోయాయని, వాటిని బాగు చేయాలని బృందం కోరింది. ఏ విధంగా చూసినా పెదంకలాం కాలువ పనులు సంపూర్ణంగా జరగడం లేదని, కోట్లాది రూపాయలు దుర్వినియోగవుతాయని రైతు సంఘం ప్రతినిధులు తెలిపారు. ఇప్పటికైనా కాలువ పూడికతీసి ఈ ఖరీఫ్‌కు నీరందించాలని, వర్షాల్లేక ఎండిపోతున్న నారుమళ్లకు తక్షణమే కాలువ ద్వారా నీళ్లు ఇవ్వాలని అధికారులను, ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం ప్రతినిధులు గేదెల జగ్గారావు, భానుమూర్తి, త్రినాథ్, మామిడి సింహాద్రి నాయుడు, యమ్మల మన్మధరావు, చిట్టి నాన్న తదితరులు పాల్గొన్నారు.



కాలువ పనులను పరిశీలిస్తున్న రైతు సంఘాల ప్రతినిధులు

### శాస్త్రీయతను దెబ్బతీసేందుకు

# సైన్స్ అవార్డుల రద్దు

ప్రజాశక్తి - విజయనగరం టౌన్

శాస్త్ర సాంకేతికతను, శాస్త్రీయ దృక్పథాన్ని దెబ్బతీసేందుకే కేంద్రం సైన్స్ అవార్డులను రద్దు చేసిందని జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎంవిఎన్ వెంకటరావు, రమణ ప్రభాత్, సాహితీ సంస్థ కన్వీనర్ చీకటి దివాకర్ ఆక్షేపించారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం విజయనగరంలో సైన్స్ వాక్ నిర్వహించారు. ముందుగా గురజాడ నివాసంలో గురజాడ అప్పారావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అక్కడ నుంచి మూడు లాంతర్లు, ఎంజి రోడ్డు, గంట స్తంభం మీదుగా బాలాజీ జంక్షన్ వరకు వాక్ జరిగింది. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్యరంగంలోనూ కేంద్ర ప్రభుత్వం అశాస్త్రీయమైన ఆలోచనలు ప్రవేశపెడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మానవాళి మనుగడలో విప్లవాత్మకమైన మార్పులను గుర్తించిన డార్విన్ సిద్ధాంతం రద్దుచేయడం సరికాదన్నారు. దీనివల్ల వల్ల సమాజం మరింత వెనుకబాటుకు గురౌతుందన్నారు. డార్విన్ సిద్ధాంతంతోపాటు భౌతిక, రసాయన శాస్త్రాలు, గణితం, చరిత్రలోని యునైటెడ్ పాఠ్యాంశాలను రద్దుచేయడానికి ప్రభుత్వం వద్ద ఉన్న హేతుబద్ధత ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. సైన్స్ అభివృద్ధి చెందితేనే కొత్త కొత్త ఆవిష్కరణలతో దేశాభివృద్ధి సాధ్యమౌతుందన్నారు. అటువంటి సైన్స్ ప్రోత్సాహాన్ని తగ్గించేలా 72 అవార్డులను కేంద్ర ప్రభుత్వం రద్దుచేస్తున్నట్టు ప్రకటించడం దారుణమన్నారు. ఇప్పటికే పరిశోధన రంగానికి నిధుల కేటాయింపులు భారీగా తగ్గించిందని వివరించారు. శాస్త్రీయతను నిలువరించి, దాని స్థానంలో ఖర్మ సిద్ధాంతాన్ని ప్రచారం చేసేందుకు ఇటువంటి చర్యలకు పాల్పడుతోందని ధ్వజమెత్తారు. ఇటువంటి చర్యలు రాజ్యాంగ స్ఫూర్తికే విరుద్ధమన్నారు. సైన్స్ అవార్డుల రద్దు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో జెవివి నాయకులు వి.రాజగోపాల్, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు జె.రమేష్‌చంద్ర పట్నాయక్, నాయకులు డి.రాము, కె.శ్రీనివాసరావు, రౌతు విజయకుమార్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పి.రామ్మోహన్, బాలరాజు, ప్రభుత్వ నాలుగో తరగతి ఉద్యోగుల యూనియన్ జిల్లా అధ్యక్షులు గంగా ప్రసాద్, శశిధర్, మేధావులు, విద్యార్థులు, యువకులు పాల్గొన్నారు.

**కేంద్రం వైఖరికి నిరసనగా జెవివి ఆధ్వర్యంలో సైన్స్ వాక్**




సైన్స్‌వాక్‌లో పాల్గొన్న జెవివి, పలు సంఘాల నాయకులు, మేధావులు, యువత



సిసి రోడ్డును ప్రారంభిస్తున్న టిడిపి కౌన్సిలర్లు

## ప్రజాధనం దుర్వినియోగం : టిడిపి


ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

మున్సిపల్ పాలకవర్గం రూ.10లక్షలు ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిందని మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్, 14వ వార్డు కౌన్సిలర్ ద్వారపు రెడ్డి శ్రీదేవి అన్నారు. ఆదివారం ఆమెతో పాటు టిడిపి పట్టణ పార్టీ అధ్యక్షులు గుంట్రెడ్డి రవికుమార్, ప్రధాన కార్యదర్శి సిరిపురపు భాస్కరరావు, 17,21 వార్డుల టిడిపి కౌన్సిలర్లు తాతపూడి వెంకటరమణ, బడే గౌరినాయుడు, మాజీ కౌన్సిలర్లు మంచిపల్లి సత్యనారాయణ, బంకపల్లి రవికుమార్, బంకపల్లి అశోక్ తదితరులతో కలిసి శ్రీ చైతన్య స్కూల్ ప్రదేశంలో చాలా రోజుల క్రితం వేసిన సిసి రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత నెల 30న మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశంలో చేర్చిన 9వ అంశంలో పార్వతీపురం పరిధిలో 20వ వార్డు పరిధిలో ఉన్న శ్రీ చైతన్య స్కూల్‌కు వెళ్లే మార్గాన్ని 19వ వార్డుగా చూపించి సిసి రోడ్డు నిర్మాణానికి మున్సిపల్ కౌన్సిల్ సభ్యుల అనుమతి కోరుతూ అజెండాలో పెట్టారన్నారు. అయితే ఆ ప్రదేశంలో ప్రస్తుతం సిసి రోడ్డు నిర్మాణమై ఉండగా మళ్లీ రూ.10లక్షలతో సిసి రోడ్డు నిర్మాణానికి ఇ ప్రొక్యూర్మెంట్ ద్వారా టెండర్లు పిలిచేందుకు కౌన్సిల్ సభ్యుల అనుమతి కోరడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తారా అని, ఈ విషయంపై మున్సిపల్ అధికారులు, పాలకపక్ష కౌన్సిల్ సభ్యులు వివరణ ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు.

## బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక మేజర్ పంచాయతీ పరిధిలో గల మంతినివలసకు చెందిన నిండు గర్భిణి కద్రక సునీత ఇటీవల మృతి చెందిన సంఘటన తెలుసుకున్న ఎమ్మెల్యే పి.పుష్ప శ్రీవాణి ఆదివారం ఆమె ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆమె కుటుంబ సభ్యులకు కొంత నగదును అందజేసి ఓదార్చారు. అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపిపి శెట్టి పద్మావతి, మేజర్ పంచాయతీ సర్పంచ్ జి.సుజాత, ఉప సర్పంచ్ షేక్‌ఖాదర్, వైసిపి (గ్రీవెన్స్) జిల్లా అధ్యక్షులు అంధవరపు కోటేశ్వరరావు, వైసిపి మైనార్టీ విభాగ నాయకులు షేక్ నూరుల్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి ఆర్థికసాయం చేస్తున్న జనసేన నాయకులు మోహనరావు

## జనసేన ఆర్థిక సాయం

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని జోగింపేటకు జనసేన కార్యకర్త ఉద్దవోలు ప్రకాష్ శస్త్రచికిత్స చేయించుకున్నారు. ఈమేరకు ఆయన్ను స్థానిక జనసేన నాయకులు పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. మీకు అండగా తాము ఉన్నామని భరోసా ఇచ్చారు. అలాగే అదే గ్రామానికి చెందిన ముగ్గురు మహిళలు ప్రమాదంలో గాయపడిన విషయం తెలుసుకొని వారికి కూడా పార్టీ తరుపున ఆర్థిక సాయం చేసి భరోసా కల్పించారు. కార్యక్రమంలో పార్వతీపురం నియోజకవర్గ ఐటీ కోఆర్డినేటర్ పైల సత్యనారాయణ, నాయకులు అక్కివరపు మోహన్ రావు, అల్లు రమేష్, మురళి, సంతోష్, సత్యనారాయణ, రఘు, నరేష్, ధనుంజయ్, చిరంజీవి, కార్యకర్తలు పాల్గొన్నారు.



గోతుల మయమైన చిట్టుపుడివలస రోడ్డు

## గోతులు పూడ్చేదెప్పుడు?

ప్రజాశక్తి - వీరఘట్టం

తమ గ్రామానికి వెళ్లే రహదారిలో గోతులు పూడ్చేదెప్పుడని మండలంలోని చిట్టిపుడివలస గ్రామస్తులు అధికారులను కోరుతున్నారు. పదేళ్ల కిందట రూ.36.36 లక్షలతో చిటిపుడివలస జంక్షన్ నుండి ఆ గ్రామం వరకు అప్పట్లో పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో బిటి రహదారి నిర్మాణ పనులు చేపట్టారు. అయితే పనులు జరిగిన సమయంలో అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో రహదారి మూడు రోజులు ముచ్చటగా మారింది. ఎక్కడికక్కడే రాళ్లు తేలుతూ గోతులు నిండిఉండటంతో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా గర్భిణీలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు గ్రామస్తులు ఆరోపించారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి రహదారి మరమ్మతులు చేపట్టేందుకు తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## అధిక విద్యుత్తు బిల్లులతో ప్రజలు బేజారు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

వైసిపి ప్రభుత్వం ఇటీవల ట్రూ అప్, ఇతర చార్జీల పేరిట విద్యుత్ వినియోగదారులకు అధిక మొత్తంలో బిల్లులు వేస్తూ ప్రజలపై మోయలేని ఆర్థిక భారం వేస్తోందని కురుపాం నియోజకవర్గ టిడిపి సీనియర్ నాయకులు బిడ్డిక పద్మావతి అన్నారు. రెండు నెలల కిందట రూ.150 నుంచి 200 వరకు వచ్చే విద్యుత్ బిల్లు గత నెల నుండి రూ.350 పైబడి వస్తుందన్నారు. ఇప్పటికే గ్యాస్, పెట్రోల్, తదితర నిత్యావసరాల ధరలను పెంచిన ప్రభుత్వం విద్యుత్ భారాలు కూడా మోపడం సరికాదన్నారు. సంక్షేమ పథకాల పేరుతో ఇచ్చింది గోరంతయితే ప్రజల నుంచి దోచుకుంటుంది కొండంతని విమర్శించారు. సంక్షేమ పథకాల పేరుతో ప్రజలను సంక్షోభంలోకి నెడుతున్నారన్నారు. రైతులకు 9 గంటల ఉచిత విద్యుత్ ఇస్తామన్న హామీ గాలికి వదిలేసి, ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్లు వరకు విద్యుత్ అందిస్తామన్న జగన్మోహన్‌రెడ్డి ఈనాటికి కూడా ఆ హామీని నెరవేర్చలేదన్నారు. ఇప్పటికైనా ప్రజల కష్టాలను గుర్తించి విద్యుత్ బిల్లుల భారం తగ్గించాలని కోరారు.

## వీరఘట్టం ఎస్ఐగా రమణ

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక సబ్ ఇన్‌స్పెక్టర్‌గా ఎంవి రమణ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఇప్పటి వరకు విధులు నిర్వహించిన ఎస్ఐ ఎం.హరికృష్ణ శ్రీకాకుళం బదిలీపై వెళ్లారు. పాచిపెంటలో విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ ఎంవి రమణ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఐ ఎంవి రమణ మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ఉండేందుకు అన్ని విధాలా చర్యలు తీసుకుంటామని, గ్రామస్తులు సహకరించాలని ఆయన కోరారు.

## 6న వాహనాల వేలం

ప్రజాశక్తి -గరుగుబిల్లి

స్థానిక పోలీసు స్టేషన్ పరిధిలో నాటు సారా రవాణా చేస్తూ పట్టుబడిన వాహనాలను ఈనెల 6న వేలం వేయనున్నట్లు ఎస్ఐ రాజేష్ తెలిపారు. ఈ వేలంలో ఐదు ద్విచక్ర వాహనాలు ఉన్నాయన్నారు. కావున ఆసక్తి గల వారు ఉదయం 11 గంటలకు పోలీసు స్టేషను వద్ద వచ్చి వేలంలో పాల్గొనవచ్చన్నారు. ఈ వేలం పాలకొండ ఎస్‌డిపిఒ, ఎక్సైజ్ సూపరింటెండెంట్ సమక్షంలో జరుగుతుందన్నారు.

# ఏజెన్సీకి వరం ఏరియా ఆస్పత్రి

- రూ.17 కోట్లతో శరవేగంగా వంద పడకలతో నిర్మాణం
- అందుబాటులో వైద్య నిపుణులు, అత్యవసర సేవలు

ప్రజాశక్తి - సాలూరు

పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం ఏరియా ఆసుపత్రిగా రూపాంతరం చెందడం ఏజెన్సీ ప్రాంతంలోని నిరుపేద గిరిజన రోగులకు వరం కానుంది. 30పడకల సంఖ్య నుంచి వంద పడకల ఆసుపత్రిగా రూపుదిద్దుకోవడం ఈ ప్రాంతంలో ఆరోగ్య అత్యవసర సేవలకు కేంద్ర బిందువు కానుంది. ఇంతవరకు ఏమాత్రం అత్యవసర వైద్యసేవలు కావాలన్నా విజయనగరం, విశాఖపట్నం నగరాల్లోని పెద్దాసుపత్రులకు పరుగులు తీసే పరిస్థితి వుండేది. రూ.17కోట్లతో శరవేగంగా నిర్మాణమవుతున్న ఏరియా ఆసుపత్రి సిద్ధమైతే వెనుకబడిన గిరిజన ప్రాంతంలో నిరుపేదల ఆరోగ్య వెలుగురేఖలు విరబూయనున్నాయి. ప్రస్తుతానికి ఏరియా ఆసుపత్రిగా రూపాంతరం చెంది అవసరమైన వైద్యనిపుణులు, సిబ్బందిని నియమించినా వసతి సమస్యగా కనిపిస్తోంది. పడకలు ఏర్పాటు చేయడానికి, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన స్కానింగ్, ఎక్స్‌రే ప్లాంట్ ఇతర వైద్య సదుపాయాలు కల్పించేందుకు వసతి ప్రధాన అడ్డంకిగా ఉంది. ఎంత తొందరగా వందపడకల ఆసుపత్రి నిర్మాణమైతే అంత తొందరగా ఏరియా ఆసుపత్రి సేవలు పూర్తి స్థాయిలో రోగులకు అందే అవకాశం ఉంటుంది. నూతన భవనం అందుబాటులోకి వచ్చేంత వరకు సామాజిక ఆరోగ్య కేంద్రం భవనంలోనే 75పడకలను ఏర్పాటు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆసుపత్రి వరండాల్లో రోగులకు పడక మంచాలు ఏర్పాటు చేశారు. ఒక్కో విభాగం వైద్య నిపుణులు వేర్వేరు గదుల్లో ఒపి సేవలందించేందుకు అవసరమైన గదులు లేక అందరూ ఒకే చోట ఉండి రోగులను తనిఖీలు చేయాల్సి వస్తోంది.

### ఉన్న వసతిలో పడకల ఏర్పాటు

సామాజిక ఆరోగ్య కేంద్రం వసతిలోనే 80పడకలను ఏర్పాటు చేశాం. కొత్త ఆసుపత్రి భవనం అందుబాటులోకి వస్తే వసతి సమస్య పరిష్కారమవుతుంది. అంతవరకు రోగులకు ఇబ్బంది లేకుండా పడకలను వరండాల్లో ఏర్పాటు చేశాం. ఆసుపత్రిలో అన్ని రకాల వైద్య సేవలకు వైద్యనిపుణులు ఉన్నారు. అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నాం. అయితే ఇక్కడ నియామకమైన రేడియాలజీ స్కానింగ్ డాక్టర్, చర్మవ్యాధి నిపుణులు విధుల్లో చేరలేదు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఎనస్థీషియా విభాగంలో సివిల్ అసిస్టెంట్ పోస్టు ఖాళీగా ఉంది. మిగిలిన అన్ని విభాగాల్లో వైద్య సేవలు అందుతున్నాయి.

**డాక్టర్ వేణుగోపాల్, ఆసుపత్రి సూపరింటెండెంట్**



ఒకే బెడ్‌పై చికిత్స పొందుతున్న ఇద్దరు రోగులు

### పెరుగుతున్న ఒపి

ఏరియా ఆసుపత్రిగా రూపాంతరం చెందడంతో ఇక్కడ అత్యవసర వైద్యసేవలు అందుతున్నాయి. దీంతో రోగుల తాకిడి పెరుగుతూ వస్తోంది. రోజువారీ సగటు అవుట్ పేషెంట్ల సంఖ్య 250గా ఉంటుంది. ఇన్ పేషెంట్ల సగటు 83గా ఉంది. ఆసుపత్రిలో నెలవారీ గర్భిణుల ప్రసవాల సగటు 80. వీటిలో 20మంది వరకు శస్త్రచికిత్సల ద్వారా ప్రసవాలు చేస్తున్నారు. కొత్త భవనం అందుబాటులోకి వస్తే ఒపితో పాటు ఇన్ పేషెంట్ల సంఖ్య, ప్రసవాల సంఖ్య పెరిగే అవకాశం ఉంది.

### గిరిజన రోగులకు వరం

ఏరియా ఆసుపత్రి మారుమూల గిరిజన గ్రామాల్లోని ప్రజలకు వరంగా మారనుంది. నియోజకవర్గంలోని సాలూరు, పాచిపెంట, మక్కువ మండలాల్లో గిరిజన గ్రామాలు ఎక్కువగా వున్నాయి. వీటిలో గిరిశిఖర గ్రామాలు కూడా ఉన్నాయి. ఈ గ్రామాల్లో ఇప్పటికీ గిరిజనులు మూఢనమ్మకాలు, దురలవాట్లు కారణంగా అనారోగ్యం బారిన పడుతున్నారు. రోగాలు బాగా ముదిరిన తర్వాత ప్రభుత్వాసుపత్రులకు వస్తున్నారు. అంతేకాకుండా ఈ ప్రాంతంలో బాల్యవివాహాలు కూడా ఎక్కువే. బాలికలకు రజస్వల అయిన వెంటనే పెళ్ళిళ్లు చేయడానికి సిద్ధమవుతున్నారు. అంటే 15ఏళ్లకే బాలికలకు వివాహాలు చేస్తుండడంతో 16, 18 సంవత్సరాలకే గర్భం దాల్చిన పరిస్థితులు నెలకొన్నాయి. ఇలాంటి కేసులు ఎక్కువగా పెద్దాసుపత్రి కి వస్తుంటాయి.



సాలూరు ఏరియా ఆస్పత్రి

### జాతీయ రహదారిపై ప్రమాదాలు

పట్టణం నడిబొడ్డు మీదుగా జాతీయ రహదారి 26 వెళుతోంది. ఒడిశా, ఛత్తీస్గఢ్ రాష్ట్రాలకు అధిక సంఖ్యలో వాహనాల రాకపోకలు జరుగుతుంటాయి. అంతర్రాష్ట్ర రహదారి ఉండడంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడిన వారు, ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారని ఆసుపత్రికి తీసుకొస్తారు. వీరికి అత్యవసర వైద్యసేవలందించాల్సి ఉంటుంది.

### ఆరోగ్య ప్రదాయిని ఏరియా ఆసుపత్రి

వందపడకల ఏరియా ఆసుపత్రి పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తే ఏజెన్సీ ప్రాంత ప్రజలకు ఆరోగ్య ప్రదాయిని అవుతుంది. 2019 ఎన్నికల ముందు టిడిపి ప్రభుత్వం హయాంలో ఆదరాబాదరాగా వందపడకల ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. నిధుల మంజూరు లేకుండానే ఎన్నికల్లో గెలుపు కోసం అప్పటి ప్రభుత్వం వందపడకల ఆసుపత్రికి భూమి పూజ చేసింది. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దీనికి నిధులు మంజూరు చేయించి నిర్మాణ పనులు ప్రారంభించాం. రానున్న ఎన్నికల నాటికి వందపడకల ఆసుపత్రి నిర్మాణం పూర్తి చేయాలని కాంట్రాక్టరును కోరాం. ఆ దిశగా అడుగులు పడుతున్నాయి.

**పి.రాజన్నదొర, డిప్యూటీ సిఎం**

# 'నాడు-నేడు'పై పర్యవేక్షణ కరువు

ప్రజాశక్తి-పాలకొండ/పాలకొండ రూరల్

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కోసం ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చిస్తుంది. మొదటి విడతలో పాలకొండ మండలంలో 12 స్కూళ్లు నాడు-నేడు పనులు జరగ్గా రెండో విడతలో 22 పాఠశాలలతో పాటు ప్రభుత్వ బాలురు, బాలికల కళాశాలల్లో కూడా నాడు-నేడు పనులు కొనసాగుతున్నాయి. సుమారు రూ.6 కోట్లుతో ఈ పనులు చేపడుతున్నారు. అయితే ఈ పనులు పర్యవేక్షించడంలో సంబంధిత అధికారుల నిర్లక్ష్యం కనపడుతుంది. తల్లిదండ్రుల కమిటీని భాగస్వామ్యం చేసినప్పటికీ కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరించి పనులు చేపడుతున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో పనులు కూడా సకాలంలో పూర్తయ్యే పరిస్థితి కనిపించడం లేదు. ముఖ్యంగా కాంట్రాక్టర్లు నిబంధనలు పక్కన పెట్టి పనులు ఇష్టానుసారంగా చేస్తున్నట్టు తెలుస్తోంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పక్కాగా ఈ పనులు జరపాల్సి ఉంది. ఎన్ని సిమెంట్ బస్తాలు కొనుగోలు చేశారు. ఎంత ఇసుక వినియోగిస్తున్నారు, ఇనుము ఎంత కొంటున్నారో రశీదులతో సహా సంబంధిత పాఠశాలల హెచ్‌ఎంలకు రశీదులను ఇవ్వాల్సి ఉన్నప్పటికీ నకిలీ రశీదులను సృష్టించి ఇష్టానుసారంగా బిల్లులు డ్రాచేస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అదే విధంగా కూలీల సంఖ్య కూడా పెంచి బిల్లుల మంజూరుకు హెచ్‌ఎంలపై ఒత్తిడి తీసుకువస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొన్ని పాఠశాలల్లో ప్రధానంగా తల్లిదండ్రుల కమిటీని మాయ చేసి కాంట్రాక్టర్లు ఇష్టానుసారంగా నిధులు దుబారా చేస్తున్నట్టు తెలుస్తోంది. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా పాఠశాలల్లో అనేక వసతులు కల్పించడం కోసం నాడు-నేడు పనులకు కోట్లాది రూపాయలు కుమ్మరిస్తున్నా క్షేత్రస్థాయిలో ఆ పనులు సక్రమంగా జరగకపోవడంతో పలువురు పెదవి విరుస్తున్నారు.



వెంకంపేటలో ఇంకా పూర్తి కాని పక్కా భవనాలు

### జవాబుదారీ తనం లేదు....

ఈ పనులను పర్యవేక్షించాల్సిన సంబంధిత ఇంజనీరింగ్ శాఖాధికారుల జాడ కరువవుతుంది. దీంతో ఈ పనులు ఎలా జరుగుతున్నాయో తెలియడం లేదు. కనీసం మూడు నెలలకొకసారి మండల సర్వసభ్య సమావేశాల్లో కూడా అధికారులు హాజరుకావడం లేదు. గతంలో జరిగిన సమావేశంలో స్థానిక సర్పంచ్‌లు, ఎంపిటిసిలు నాడు-నేడు పనులపై దుమ్మెత్తిపోశారు. బిల్లుల చెల్లింపుల్లో కూడా జాప్యం జరుగుతుందని అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. అయినప్పటికీ చర్యలు తీసుకునే దాఖలాల్లేవు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

# షట్టర్ ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని గంగంపేట గిరిజన గ్రామ సమీపంలో లక్ష్మీ సాగరం చెరువుకు షట్టర్ ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు. ఈ చెరువు ఆయకట్టు కింద సుమారు వంద ఎకరాలు పైబడి పంటలు సాగు చేస్తున్నామని, కురుస్తున్న వర్షాల కారణంగా పైనుంచి వచ్చే వరద నేరుగా చెరువులోకి చేరుతుందని, చెరువుల నీరు ఎక్కువగా ఉన్నట్లయితే షట్టర్ ద్వారా బయటకు సాగునీరు తొలగించవచ్చని, తక్కువ నీరు ఉన్నట్లయితే షట్టర్ ద్వారా నిల్వ చేసుకోవచ్చని తెలిపారు. ఈ కారణంగా ఏడాదికి రెండు పంటలు సాగు చేయాల్సిన అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. షట్టర్ ఏర్పాటు చేయకపోవడం వల్ల వరి పొట్ట దశలో ఉన్నప్పుడు సాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. పంటను తడుపుకునేందుకు రాత్రింబవళ్లు సాగునీటి కోసం చివరి పోరాటం తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేలాది రూపాయలు వెచ్చించి పంటలు సాగు చేసినప్పటికీ సకాలంలో నీరందక కళ్లముందు పంట నాశనమైపోతే చూడలేకపోతున్నామని, ఈ అంశంపై గత ప్రభుత్వంలో పాలకొండ నియోజకవర్గం బాధ్యులు నిమ్మక జయకృష్ణ వద్ద విన్నవించినట్లు రైతులు తెలిపారు. ప్రస్తుతం వర్షాభావ పరిస్థితులు కారణంగా ఎదలు జల్లుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని రైతులు చెబుతున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి సాగునీటి కోసం రైతులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని షట్టర్ ఏర్పాటుకు తగుచర్యలు తీసుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.

## ఎంఇఒగా గౌరునాయుడు

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక మండల విద్యాశాఖ అధికారి-1గా గౌరునాయుడు నియమితులైనట్లు ఆ కార్యాలయ సిబ్బంది ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈయన విజయనగరం జిల్లా గజపతినగరం నుండి బదిలీపై ఇక్కడికి వస్తున్నారు. ఇప్పటి వరకు మండల విద్యాశాఖ అధికారిగా విధులు నిర్వహించిన ఎ.శ్రీనివాసరావు బదిలీపై వెళ్లినట్లు సిబ్బంది తెలిపారు.

# పార్వతీపురం డిపోను గాడిలో పెట్టాలి

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

స్థానిక ఎపిఎస్ ఆర్‌టిసి డిపోను గాడిలో పెట్టాలని జనసేన నాయకులు కోరారు. ఆదివారం జనసేన జిల్లా నాయకులు అన్నాబత్తుల దుర్గాప్రసాద్, వంగల దాలినాయుడు, కొల్లి వెంకట్రావు విలేకరులతో మాట్లాడుతూ పార్వతీపురం ఆర్టీసీ డిపో గత కొంతకాలంగా అస్తవ్యస్తంగా తయారైందని ఆరోపించారు. అధికారులు, యూనియన్లు, సిబ్బంది మధ్య జరుగుతున్న యుద్ధంలో ప్రయాణికులు బలి పశువులవుతున్నారన్నారు. కిలోమీటర్ల పెంపు, ఆన్లైన్ టీమ్‌ల విషయంలో జరుగుతున్న గొడవలో భాగంగా దాదాపు 30 మంది డ్రైవర్లు విధుల్లో లేక విజయవాడ, విశాఖపట్నం తదితర ప్రాంతాలకు బస్సులు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాగే బస్సుల నిర్వహణ లేక డొక్కు బస్సులతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారన్నారు. స్పేర్ పార్టుల కొరత, శాశ్వత మెకానిక్‌లు లేకపోవడంతో ఏ బస్సు ఎక్కడ ఆగిపోతుందో, ఎక్కడ ప్రమాదానికి గురవుతుందో తెలియక ప్రయాణికులు బిక్కు బిక్కు మంటూ ప్రయాణాలు చేస్తున్నారన్నారు. అలాగే స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ ప్రాంగణంలో చీకటి పడితే లైట్లు లేక ప్రాంగణమంతా చిమ్మ చీకటిగా ఉంటుందన్నారు. ఇదే అదునుగా అసాంఘిక శక్తులు తమ కార్యక్రమాలకు ఆర్టీసీ డిపో ప్రాంగణాన్ని అడ్డాగా మార్చుకున్నారనిఆరోపించారు. వర్షం పడితే బస్సులు కారిపోవడం, బస్సుల్లో కనీస వసతుల్లేక డొక్కు బస్సులతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇక సిబ్బంది సౌకర్యాలలేమితో నానా అవస్థలుపడుతున్నారన్నారు. కూనేరు, సర్వపాడు, రాజ్యలక్ష్మి పురం తదితర ప్రాంతాలకు గతంలో నడిచే బస్సులను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. తక్షణమే సంబంధిత పాలకులు, ఉన్నతాధికారులు దృష్టి సారించి స్థానిక ఆర్‌టిసి డిపోను గాడిలో పెట్టాలని, లేకుంటే జనసేన పార్టీ ఆందోళన చేపడుతుందని హెచ్చరించారు.

# మార్కెట్లోకి పైనాపిల్

## వాహనాల ద్వారా రవాణా చేస్తున్న దళారులు


ప్రజాశక్తి - సీతంపేట

సీతంపేట ఏజెన్సీలో గిరిజనులకు ఆర్థికంగా చేయూతనిచ్చేది అటవీ ఉత్పత్తుల్లో పైనాపిల్ పంట (అనాస పనస) ఒకటి. ప్రస్తుత సీజన్ కావడంతో మార్కెట్లోకి ఈ పంట దిగుమవుతోంది. ఏజెన్సీలో 3వేలఎకరాల వరకు ఈ పంట సాగులో ఉందని ఉద్యాన శాఖ అధికారులు చెప్తున్నారు. వాస్తవానికి ఇంకా ఎక్కువ విస్తీర్ణంలోనే సాగవుతోంది. అయితే గతేడాదితో పోల్చితే ఈ ఏడాది దిగుబడి తక్కువేనని స్వయంగా గిరిజనులే చెబుతున్నారు. ఎందుకంటే వాతావరణం అనుకూలంగా లేకపోవడం, పైనాపిల్ పూత దశలో వర్షాలు విస్తారంగా పడి ఆ పువ్వుపై నీళ్ల నిల్వ ఉండి మురుగుపోయి పువ్వు రాలింది. దీంతో ఈ ఏడాది పంట తగ్గిందని గిరిజనులు వాపోయారు. మండలంలోని కుసిమి, శంభాం, పూతికవలస, చాపరాయిగూడ, పొల్ల తదితర ప్రాంతాల్లో పైనాపిల్ సాగవుతోంది. సీతంపేట, కుసిమి, మర్రిపాడు దోనుబాయి సంతల నుంచి విజయనగరం, విశాఖ, రాజమండ్రి విజయవాడ, పర్లాకిమిడి, భువనేశ్వర్, కటక్ తదితర ప్రాంతాలకు ఈ పంట ఎగుమతి అవుతుంది. ఇక్కడ పైనాపిల్ పండు పది నుండి 15 రూపాయలు కొనుగోలు చేసుకుని బయట మార్కెట్లో 25 నుంచి 30 రూపాయల వరకు విక్రయిస్తారు. గిరిజనుల అవసరాలను గుర్తించి దళారులంతా సిండికేట్‌గా మారి పైనాపిల్‌ను కారుచౌకగా కొనుగోలు చేసుకుని మార్కెట్లో అధిక ధరలకు విక్రయించి లాభాలు ఆర్జిస్తుండగా, ఆరుగాలం కష్టించి పండించిన రైతుకు మాత్రం గిట్టుబాటు కావడంలేదు.

ఈ విషయమై జిల్లా ఉద్యాన శాఖ అధికారి కెఎస్ఎన్ రెడ్డి వద్ద ప్రస్తావించగా గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది పంట తగ్గలేదని, పైగా మార్కెట్ ధర కూడా బాగా పలుకుతుందని సమాధానం ఇచ్చారు.



సీతంపేట సంతకు వచ్చిన పైనాపిల్‌లు



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు

## ఆటో బోల్తా ; పలువురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - కురుపాం

బ్రేకులు ఫెయిల్ అయి ఆటో లోయలో పడి పలువురికి తీవ్రగాయాలైన సంఘటన మండలంలోని ఊసకొండ పంచాయతీ సమీపాన గల ఘాట్‌రోడ్డు వద్ద ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు అందించిన వివరాలు ప్రకారం బలిజిపేట మండలం నారాయణపురానికి చెందిన వి.జయమ్మ (65), బి.ప్రసాద్ (35), వి.కృష్ణ (45), కురుపాం మండలం ధర్మలక్ష్మిపురం గ్రామానికి మద్యం మానిపించడానికి పసర మందు నిమిత్తం వస్తుండగా ఊసకొండ సమీపంలో గల ఘాట్ రోడ్డు వద్ద ఆటోకు బ్రేకులు ఫెయిలై లోయలో పడడంతో తీవ్ర గాయాలయ్యారు. వీరికి చినమేరంగి సామాజిక ఆరోగ్య కేంద్రానికి 108 వాహనం ద్వారా తరలించి ప్రాథమిక చికిత్స అందించి అనంతరం మెరుగైన వైద్యం కోసం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## వ్యాను ఢీకొని ఫీల్డ్ అసిస్టెంట్‌కు గాయాలు

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

గరుగుబిల్లి మండలం తోటపల్లికి చెందిన ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ ముసిడిపల్లి శంకరరావు అనే వ్యక్తి ఆదివారం అదే మండలం నాగూరు సమీపంలో జరిగిన రహదారి ప్రమాదంలో గాయాలు పాలయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం గాయపడ్డ శంకరరావు ఆదివారం పార్వతీపురం మండలం ఆడారులో జరుగుతున్న తన బంధువుల ఇంటిలో ఫంక్షన్ హాజరై ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తుండగా, నాగూరు విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రాంతంలో ఎదురుగా వస్తున్న వ్యాను ఢీకొనడంతో గాయపడ్డాడు. స్థానికులు స్పందించి 108 వాహనంలో జిల్లా ఆసుపత్రికి తరలించగా, వైద్యులు చికిత్స అందిస్తున్నారు. అవుట్ పోస్ట్ పోలీసులు వివరాలు నమోదు చేశారు.

# నేరాలు ఘోరాలు

## కి'లేడి' అరెస్టు

ప్రజాశక్తి- బొబ్బిలి

పట్టణంలో రిటైర్డ్ టీచర్ కె.వెంకట రమణమూర్తి నుంచి రూ.1.50లక్షలు నగదు అపహరిం చుకుపోయిన మాయలేడిను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. స్థానిక పోలీసులు స్టేషన్ డిఎస్‌పి పి.శ్రీధర్ ఆదివారం వివరాలు వెల్లడించారు. గతనెల 28న పూల్ బాగ్ కాలనీకు చెందిన రిటైర్డ్ టీచర్ వెంకటరమణమూర్తి నగదు విత్ డ్రా చేసేందుకు గాంధీబొమ్మ రోడ్డులో ఉన్న యూనియన్ బ్యాంకుకు వెళ్ళాడు. బ్యాంక్ ఖాతాలో ఉన్న రూ.1.50లక్షలు విత్ డ్రా చేసుకుని ఇంటికి వెళ్లేందుకు సిద్ధంగా ఉండగా సహాయం చేస్తున్నట్లు ఒకమహిళ నటించి రిక్షాలో అతన్ని ఎక్కించి అతనితో పాటు ఇంటి వరకు వెళ్లింది. ఆయన ఇంటిలోకి వెళ్తున్న సమయంలో బ్యాగ్ లాక్కుని అతన్ని ఇంటిలోకి నెట్టేసి తలుపునకు గెడ పెట్టి పరార్ అయింది. వెంటనే వృద్ధుడు పోలీసులకు పిర్యాదు చేయడంతో పట్టణ సిఐ నాగేశ్వరరావు, ఎస్ఐ సత్యనా రాయణ, కానిస్టేబుల్స్‌తో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి దర్యాప్తు చేయగా గొల్లపల్లి గ్రామానికి చెందిన గొల్లపల్లి శ్రావణిగా గుర్తించి ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించింది. శ్రావణి భర్త శివతో రాయగడ జెకెలో నివాసముంటుంది. అమ్మఒడి డబ్బులు కోసం శ్రావణి బ్యాంకుకు వచ్చి నేరం చేసినట్లు డిఎస్‌పి చెప్పారు. సిఐ నాగేశ్వరరావు, ఎస్ఐ సత్యనారాయణ, సిబ్బంది ఉన్నారు.

## స్నేహితుడిపై హత్యాయత్నం

ప్రజాశక్తి- శృంగవరపుకోట

మండలంలోని ధర్మవరంలో ఒక శుభకార్యం వద్ద ఘోరం జరిగింది. ఫుల్లుగా మద్యం తాగిన ఇద్దరు స్నేహితులు గ్రామంలో జరుగుతున్న ఒక శుభకార్యం వద్దకు వెళ్లారు. అక్కడ పక్కనే ఉన్న గదిలోకి ఇద్దరు వెళ్లారు. అక్కడ ఏం జరిగిందో తెలియదు గానీ తన స్నేహితుడి మెడను చాకుతో మరో స్నేహితుడు కోసేసాడు. ఈ విషయంపై స్థానికులు మాట్లాడుతూ గ్రామానికి చెందిన కక్కల అప్పయ్య, నోట్ల బంగారుబాబు మంచి స్నేహితులు. వీరిద్దరూ గ్రామంలో జరుగుతున్న పాదం రాంబాబు ఇంట్లో శుభకార్యానికి ఆదివారం వెళ్లారు. శుభకార్యం సమీపంలో ఉన్న ఒక గదిలోకి ఇద్దరు వెళ్లారు. వెళ్లిన కాసేపటికి బంగారుబాబు మెడపై గాయంతో కేకలు వేస్తూ బయటకు వచ్చాడు. ఇదే సమయంలో చేతిలో చాకుతో కక్కల అప్పయ్య బయటకు వచ్చాడు. ఇది చూసిన స్థానికులు భయపడిపోయారు. వెంటనే గాయపడిన బంగారు బాబుని ఆటోలో స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి హుటాహుటిన తీసుకెళ్లారు. వెంటనే డాక్టర్ ఉదయ్ కుమార్ బాధితుడికి చికిత్స అందించి చాకు లోతుగా దిగి ఉంటే ప్రాణాలు పోయేవని ప్రస్తుతం ప్రాణపాయం లేదని చెప్పారు. ఎస్ఐ తారకేశ్వరరావు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలపై ఆరా తీశారు.

## పెదతరిమి వద్ద రణస్థలం వాసి మృతి

**నెల్లిమర్ల:** మండలంలోని పెదతరిమి వద్ద రణస్థలం మండలం వేలుపురాయి గ్రామానికి చెందిన బాలి దాలినాయుడు మృతి చెందాడు. ఆదివారం ఉదయం స్థానికులు గ్రామ శివారులో మృతదేహాన్ని గుర్తించి కుళ్లి, దుర్వాసన రావడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దాలినాయుడుగా గుర్తించారు. మృతుడు గత నెల 17న బ్యాంకకు వెళ్తానని చెప్పి ఇంటికి రాక పోవడంతో కుటుంబ సభ్యులు పరిసర ప్రాంతాల్లో వెతికారు. దొరకక పోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో పెద తరిమి గ్రామ శివారు మెట్టపై దాలినాయుడు మృత దేహం కనిపించింది. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

**వంగర:** మండలంలోని మద్దివలస సమీపంలో ఆదివారం సాయంత్రం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో మన్యం జిల్లా గరుగుపల్లి మండలం రావు పల్లి గ్రామానికి చెందిన గుంట్రెడ్డి ఉమామహేశ్వరరావు (50) కి తీవ్ర గాయాలయ్యాయి.

స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉమామహేశ్వరరావు శ్రీకాకుళంలో గల తన స్నేహితుని వద్దకు వెళ్లి తిరుగు ప్రయాణంలో బైక్ పై వస్తుండగా మండలంలోని బంగారు వలస వైపు నుంచి వంగర వైపు ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొనడంతో కింద పడిపోయాడు. ఆయనకు కుడి కాలు, ఎడమ చేయి విరిగిపోయినట్లు స్థానికులు తెలిపారు. స్థానికులు అంబులెన్స్‌కి సమాచారమిచ్చి రాజాం ఆస్పత్రికి తరలించారు.